క్లుప్తంగా

పరమానందయ్య ఆశ్రమంలో చిన్నజీయర్‌స్వామి


వసతి గదులు ప్రారంభిస్తున్న చిన్నజీయర్‌స్వామి

సోమశిల: సోమశిల జలాశయం సమీపంలో ఉన్న పరమానందయ్య ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, వసతి గదులను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి బుధవారం ప్రారంభించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. పెన్నానది తీరాన ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న పరమానందయ్య ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలో ఆశ్రమంలో వేద పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.

బిట్రగుంట రైల్వే ప్రగతికి సహకరించండి

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేకు పూర్వవైభవం తీసుకొచ్చేలా కొత్తప్రాజెక్టుల ఏర్పాటుకు సహకారం అందించాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లాకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌ను నెల్లూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా నిరుపయోగంగా ఉన్న వందలాది ఎకరాల భూములు, రైల్వే వనరులు సద్వినియోగమయ్యేలా కొత్త ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేస్తే రైల్వేకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, ఆ దిశగా సహకారం అందించాలని కోరారు. అనంతరం బిట్రగుంట లోకోషెడ్‌తో కూడిన చిత్రపటాన్ని జీఎంకు అందజేశారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: నెల్లూరులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా ముఖ్య నేతల సమావేశానికి విచ్చేసిన ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎం సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

కావలి: పట్టణంలోని విట్స్ కళాశాల వద్ద పెద్ద పవని రోడ్డులో మున్సిపల్ తాగునీటి పైపులైన్‌కు మంగళవారం అర్ధరాత్రి లీకేజీ ఏర్పడింది. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేపడుతున్నారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అల్లూరు: స్థానిక రామకృష్ణ కళాశాల ఆవరణలో అయ్యప్పస్వామి పడిపూజోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు విశేషంగా హాజరై భజనలు చేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ఆత్మకూరురూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కృష్ణా జిల్లాకు చెందిన 10వ బెటాలియన్ జాతీయ విపత్తుల రక్షకదళం అధికారులు కరటంపాడులో బుధవారం అవగాహన కల్పించారు. బెటాలియన్ కమాండర్ కృష్ణావతార్ ఆధ్వర్యంలో రెస్క్యూ టీం సభ్యుడు సందీప్‌కుమార్‌రెడ్డి మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. సర్పంచ్ పూనుగుంట రేవతి, వీఆర్వో చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, ఎల్‌వీ ప్రసాద్, స్థానిక నాయకులు దావా పెంచలరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలు పక్కాగా నిర్వహించాలి

ఉదయగిరి /ఆత్మకూరురూరల్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను అజెండా ప్రకారం సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ అన్నారు. ఉదయగిరి, ఆత్మకూరులో బుధవారం నిర్వహించిన ఉర్దూ పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

వర్షం పడితే నరకమే

దారుణంగా గ్రామీణ ప్రాంత రోడ్లు

- తట్టెడు మట్టికి నోచుకోక బురదమయం
- కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు


సోమశిల: అధ్వానంగా ముత్తుకూరు–గార్లెదిన్నెపాడు రోడ్డు


సోమశిల: బురదమయంగా మేకవారిపల్లి రోడ్డు


చేజర్ల: బురదతో దారుణంగా పల్లికాపు రోడ్డు

సోమశిల/చేజర్ల: అనంతసాగరం, చేజర్ల మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలను కలిపే రోడ్లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీసం గ్రావెల్ కూడా తోలకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అడుగడుగునా గుంతలతో బురదమయంగా మారిన రోడ్లపై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రాకపోకలు సాగించేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు.

అనంతసాగరం మండలంలో ముత్తుకూరు నుంచి గార్లదిన్నెపాడుకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం బురదమయంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనాలపైన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆమనిచిరువెళ్ల ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీకి కిలోమీటర్ దూరం ఉంటుంది. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలతో బురదమయంగా మారింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వెంగంపల్లి ప్రధాన రహదారి నుంచి మేకవారిపల్లి గ్రామానికి వెళ్లే మార్గం రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గం కూడా వర్షాలతో పూర్తిగా ఛిద్రమైంది. దీంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. చేజర్ల మండలం తూర్పు కంభంపాడు మజరా గ్రామమైన పల్లికాపు గ్రామంలో 90 మందికిపైగా నివాసం ఉంటున్నారు. తూర్పు కంభంపాడు నుంచి పల్లికాపు గ్రామం రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పెన్నాతీరంలో ఉన్న పల్లికాపు గ్రామం రోడ్డు వర్షం పడితే రొచ్చురొచ్చుగా మారుతోంది. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. పల్లికాపు గ్రామంలో పాఠశాల లేదు. గ్రామానికి చెందిన 20 మంది పైగా విద్యార్థులు నిత్యం తూర్పుకంభంపాడు ప్రాథమిక పాఠశాలకు వెళ్తుంటారు. వర్షం పడితే విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం రోడ్లుపై తట్టెడు మట్టి అయినా పోయాలని ప్రజలు కోరుతున్నారు.

బోడవారిపల్లెలో పారిశుధ్య చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


కర తొలించి జేసీబీతో చదును చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దుత్తలూరు: మండలంలోని బోడవారిపల్లెలో పంచాయతీ అధికారులు ఎట్టకేలకు పారిశుధ్య చర్యలు చేపట్టారు. బోడవారిపల్లెలోని వీధుల్లో వర్షపు నీరు నిలిచి పారిశుధ్యం లోపించడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల 17న 'సాక్షి'లో 'బోడవారిపల్లిలో పారిశుధ్యం అధ్వానం' శీర్షికన కథనం ప్రచురించడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం వీధుల్లోని వర్షపు నీటిని తొలగించి కంకర తోలించి జేసీబీతో చదును చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



సీతారామపురం: ఫ్లోరోసిస్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి దివ్య తెలిపారు. మండలంలోని పబ్బులేటిపల్లిలో బుధవారం ఆమె పర్యటించారు. ప్రజలకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ అధిక శాతం ఉన్న నీటిని తాగడం వల్ల ఫ్లోరోసిస్ వస్తుందని తెలిపారు. దీని వల్ల ఎముకలు, దంత సమస్యలు వస్తాయని వివరించారు. పాలు, పెరుగుతో పాటు కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఫ్లోరిన్ అధికంగా ఉండే టూత్‌పేస్టులు, పొగాకు, ఆకు, వక్కలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. సీతారామపురం పీహెచ్‌సీ డాక్టర్ స్వప్నారెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


హజరత్తయ్య మృతదేహం

చేజర్ల: మండలంలోని పాడేరు పంచాయతీకి చెందిన తోపుగుంట హజరత్తయ్య (52) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. హజరత్తయ్య కరెంట్ పనులు చేస్తుంటాడు. అతను పాడేరు, బొగ్గులవారి కండ్రిక గ్రామాల మధ్య సోమశిల దక్షిణకాలువ 24ఎల్ సమీపంలో కాలువ గట్టుపై విద్యుత్ మోటార్ రిపేరు చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. హజరత్తయ్యకు ఇద్దరు కుమారులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



కావలి: దగదర్తి మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరామర్శించారు. రమణయ్యనాయుడు చిత్రపటానికి నివాళులర్పించి కోడలు, దగదర్తి జెడ్పీటీసీ సభ్యులు తాళ్లూరు స్వరూపారాణికి సానుభూతి తెలిపారు.

బాలల హక్కుల దినోత్సవం

కావలి: డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని శంకులవారితోటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొని బాలల సంక్షేమం, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగనవాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, రుక్మిణి, పద్మావతి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

కావలి: మామిడి సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఉద్యానశాఖ అధికారిణి సుధామయి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి, బుడుంగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండు తెగులు నివారణకు లీటరు నీటికి మ్యాంకోజెబ్ 2 మి.లీ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మ్యాంకోజెబ్ 2 మి.లీ లేదా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా రెడోమిల్ 3 గ్రాములు చొప్పున 20 లీటర్ల నీటికి కలిపి ఒక్కో చెట్టుకు పిచికారీ చేయాలని సూచించారు. కాయపగుళ్ల నివారణకు బోరాన్ 2 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. సూక్ష్మపోషకాల లోపం నివారణకు ఫార్ములా 4 నుంచి 5 గ్రాములు, ఎంజీఎస్‌ఓ 4 లేదా 2 గ్రాములు, జింక్ 2 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంపీఈఓ సుభాషిణి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలు

కావలి: గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలని కావలి ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. కావలి గ్రంథాలయం ఆవరణంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారిణి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విశిష్ట అతిథిగా సామాజికవేత్త ఎం మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. మర్రిపాడు జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, ఎస్సార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వింజమూరు గ్రంథాలయంలో విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలపై అవగాహన కల్పించారు. ప్రతిభా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారోత్సవాలకు సహకరించిన ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రంథాలయ అధికారిణి జ్యోతి కొండయ్య పాల్గొన్నారు.

అల్లూరు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా అల్లూరు గ్రంథాలయంలో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారిణి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

దుత్తలూరు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక గ్రంథాలయంలో ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మాజీ ఎంపీపీ రావి పెంచలరెడ్డి, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పువ్వాడ శ్రీను బహుమతులు ప్రదానం చేశారు. లైబ్రేరియన్ కల్పన, వార్డు మెంబర్ హజరత్‌బాబు, దేవత సుబ్బారావు, బొగ్గవరపు సుధాకర్, మానస స్కూల్ కరస్పాండెంట్ ఎం సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆత్మకూరు గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డిని సన్మానించారు. విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, వీ నారాయణ రావు, టీసీ సుబ్బయ్య, రామ్మోహన్‌రెడ్డి, లైబ్రేరి అసిస్టెంట్ తనూజ, యానాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

సోమశిల: మండలంలోని పడమటికంభంపాడు ఇసుక రీచ్ నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ సూచనలతో సోమశిల పోలీసులతో కలిసి గ్రామ రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి నిఘా ఉంచారు. బుధవారం వేకువన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి ఆర్డీఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్సై లక్ష్మీనారాయణ, పీకేపాడు, సోమశిల వీఆర్వోలు అశోక్, ప్రభాకర్, ఉప్పలపాడు సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9 మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ సెంటర్‌లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై ఉదయగిరి ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న ఏలూరి చెంచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై కరంత్ తెలిపారు.

బీజేపీ సమావేశం

చేజర్ల: స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల నాయకులతో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలో చేజర్ల మండలం నుంచి అత్యధికంగా 25 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు అయ్యాయని తెలిపారు. కార్యకర్తలకు మండల నాయకులు అండగా ఉండాలన్నారు. సీనియర్ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జీ విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, జిల్లా కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు అల్లంపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వాచ్‌మెన్ మృతి

చేజర్ల: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యనమల వెంకటకృష్ణ(53) బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కలువాయి మండలం రాజుపాళేనికి చెందిన వెంకటకృష్ణ రెండ్రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం తీవ్రఅస్వస్థతకు గురవగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. వాహనం వచ్చేలోగానే వెంకటకృష్ణ మృతి చెందాడు. కాగా వాచ్‌మెన్ మృతికి చేజర్ల వసతి గృహ సంక్షేమాధికారి సీహెచ్ వెంకరమణమ్మ, పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూ అటెండర్ పరమేశ్వర్ నివాళులర్పించారు.

బాలుడి అదృశ్యం



సంగం: స్థానిక తిరుమనతిప్ప ప్రాంతానికి చెందిన బాలుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమనతిప్పకు చెందిన గడ్డం విజయమ్మ మనుమడు వెంకటేశ్వర్‌రెడ్డి సంగం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

ఉదయగిరి/ ఆత్మకూరురూరల్: ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనం, ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధిపై సమీక్ష సమావేశాలను బుధవారం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఉదయగిరి ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ , ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆదేశించారు. ఏపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కారు, మోటార్‌బైక్‌ను బుధవారం వేలం వేశారు. సీఐ జీ గంగాధర్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్‌కే జిలానీ నిర్వహించిన వేలం పాటలో షేక్ గౌస్ కారును రూ.2.27 లక్షలకు దక్కించుకున్నాడు. మోటారు బైక్‌ను రూ.5వేలకు ఓ మెకానిక్ దక్కించుకున్నాడు.

బోగోలులో శ్రీవారి పాదాల వద్ద అపచారం


శ్రీవారి పాదాల ఆలయం


కాలిపోతున్న దేవుడి చిత్రపటాలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు నుంచి తాళ్లూరు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న 'శ్రీవారి పాదాలు' ఆలయంలో బుధవారం అపచారం జరిగింది. మధ్యాహ్న సమయంలో గుడిలోని దేవుడి పటాలు మంటల్లో కాలిపోయాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి తొలుత ఇక్కడే పాదం మోపాడని భక్తుల విశ్వాసం. స్వామివారి పాదాల గుర్తులు ఇక్కడి రాతిపై స్పష్టంగా కనిపిస్తుండడంతో భక్తులు చిన్నపాటి గుడికట్టి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా గుడిలో పెట్రోల్ పోసి దేవుడి పటాలు కాల్చారని భక్తులు అనుమానిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ప్రమాదం జరగడం, మంటలు వస్తున్న సమయంలో పెట్రోల్ వాసన రావడంతో ఎవరో పెట్రోల్ పోసి మంట పెట్టినట్లుగా భావిస్తున్నారు. భక్తుల ఫిర్యాదు మేరకు బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

నగర వనాలతో ఆహ్లాదకర వాతావరణం

- కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే రామిరెడ్డి

కావలి: పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడంతో పాటు అడవులపై అవగాహన కల్పించే లక్ష్యంతో అటవీశాఖ ఆధ్వర్యంలో కావలి, ముంగమూరు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నామని కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే రామిరెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రారంభానికి సిద్ధమైన నగర వనాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి, ముంగమూరు నగర వనాలను నర్సరీ కేంద్రాలుగానూ అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ నర్సరీల్లో అడవులు, వనసంరక్షణ సమితుల్లో నాటే మొక్కలను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల రెండు నగర వనాలు ఎల్లప్పుడూ పచ్చదనంతో శోభాయమానంగా ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు తీరిక సమయాల్లో రోజంతా గడిపేలా నగరవనాలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కుటుంబంతో సహా వనభోజనాలు చేసేందుకు సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. నగరవనాల్లో వాకింగ్ ట్రాక్‌లతో పాటు పిల్లల ఆట విడుపునకు ఆట వస్తువులు, జంతువుల బొమ్మలు, వ్యాయామ పరికరాలు, తదితరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నగర వనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, నిర్వహణను ప్రజల సహకారంతో చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వాచ్‌మెన్‌లు, చెత్తా చెదారంలను తొలిగించే సిబ్బంది, మొక్కలు పెంపకం పర్యవేక్షణ, విద్యుత్ బిల్లులు, టాయ్‌లెట్‌లను శుభ్రపరచడం తదితరాలను సమర్థవంతంగా నిర్వహణ ద్వారానే నగరవనాన్ని పరిరక్షించుకోవడం సాధ్యపడుతోందని తెలిపారు. అందుకే ప్రవేశ రుసుం ఫంక్షన్లు, వాకింగ్‌లకు నెలసరి ఫీజు నిర్ణయించనున్నట్లు తెలిపారు.